# పేదలకు వరం.. అన్నపూర్ణ పథకం

**సన్న బియ్యం పంపిణీ చాలా సంతోషకరం**



బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేదలకోసం సన్న బియ్యాన్ని పంపిణీ చేయడం చాలా సంతోషకరం. ఇప్ప వరకు ఏ ప్రభుత్వాలు కూడా చేయ లేని పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించింది. తెలంగాణ వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సన్న బియ్యాన్ని అందుకోవడం ఎంతో గర్వించ దగ్గ విషయం. సీఎం కేసీఆర్ ఈ లాంటి మంచి పథకాలను అమలు చేయడం సంతోషం. తెలంగాణ ప్రజలు సీఎంకు రుణపడి ఉంటారు.

**– భాగ్యవతి, సర్పంచ్ మల్కాపూర్, కొండాపూర్ మండలం**



సంగారెడ్డి, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన అన్నపూర్ణ పథకం పేదల పాలిట వరంగా మార నున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవలే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రకటించారు. ఇందులో సీఎం కేసీఆర్ ప్రకటించిన అన్నపూర్ణ పథకంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. మరీ ముఖ్యంగా సీఎం కేసీఆర్ ప్రకటనపై సంగారెడ్డి జిల్లాలోని పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేదలందరినీ దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ పేదలకు సన్న బియ్యం బువ్వ పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అన్నపూర్ణ పథకం ద్వారా తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించారు. అన్నపూర్ణ పథకంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరగనున్నప్పటికీ సీఎం కేసీఆర్ పేదలకు సన్న బియ్యం అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుని, మ్యానిఫెస్టోలో అన్నపూర్ణ పథకం ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

**సంగారెడ్డి జిల్లాలో 3.78 లక్షల రేషన్‌కార్డుదారులకు లబ్ధి..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం అందజేస్తున్నది. తాజాగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ అన్నపూర్ణ పథకం ద్వారా రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేస్తామని ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలో పేదలు సన్న బియ్యం అన్నం తింటామని సంబురంగా ఉన్నారు. జిల్లాలో 3,78,789 రేషన్‌కార్డులున్నాయి. ఆయా రేషన్‌కార్డులపై 12,35,514 మంది కుటుంబ సభ్యులు బియ్యం అందుకుంటున్నారు. జిల్లాలోని 846 చౌకధరల దుకాణాల ద్వారా 3,78,789 రేషన్‌కార్డులపై ప్రతినెలా 7992.77 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 3,52,483 తెల్లరేషన్‌కార్డులున్నాయి. ఈ రేషన్‌కార్డులపై ప్రతినెలా 7004.56 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వం అందజేస్తున్నది. 26206 అంత్యోదయ కార్డులపై ప్రతినెలా 917.21 టన్నులు, 100 అన్నపూర్ణ కార్డులపై టన్ను దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అన్నపూర్ణ పథకం ద్వారా రేషన్‌కార్డు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందజేస్తామని ప్రకటించింది. దీంతో జిల్లాలోని 3,78,789 రేషన్‌కార్డుదారులు సన్న బియ్యం లబ్ధిపొందనున్నారు. ఇప్పటి వరకు దొడ్డు బియ్యం తిన్న 12.35 లక్షల మంది రేషన్‌లబ్ధిదారులు అన్నపూర్ణ పథకం అమలుతో సన్న బియ్యంతో భోజనం చేయనున్నారు. ప్రభుత్వం అన్నపూర్ణ పథకం ద్వారా సన్న బియ్యం అందజేయనుండటంతో పేదలు సంతోషంగా ఉన్నారు. ప్రజలు తమకు సన్న బియ్యం బువ్వ పెడతామంటున్న కేసీఆర్‌ను మరోమారు సీఎంను చేస్తామని ఆనందంగా చెబుతున్నారు.

- **దొడ్డు బియ్యం స్థానంలో రేషన్‌కార్డుపై సన్న బియ్యం**
- **బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటన**
- **సంగారెడ్డి జిల్లాలో లబ్ధిపొందనున్న వారు 3.78 లక్షలు**

**సంగారెడ్డి జిల్లాలో రేషన్‌కార్డుల వివరాలు**

| రేషన్‌కార్డులు | సంఖ్య | సభ్యులు | బియ్యం పంపిణీ (టన్నుల్లో) |
|---|---|---|---|
| తెల్లరేషన్ కార్డులు | 3,52,483 | 1167428 | 7004.56 |
| అంత్యోదయకార్డులు | 26206 | 67984 | 917.21 |
| అన్నపూర్ణ కార్డులు | 100 | 102 | 1.00 |

## బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

**గడపగడపకూ వెళ్లి పథకాలు వివరించండి**

**కాంగ్రెస్ చేసేందేమీ లేదు**

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, అక్టోబర్ 18: కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లల్లో చేయలేని సంక్షేమం, అభివృద్ధిని సీఎం కేసీఆర్ పాలనలో ఆరేండ్లలో చేసి చూపించారని, కాంగ్రెస్ నాయకులు అసత్యపు, అబద్ధపు, మాయమాటలకు జంకకుండా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి గడపగడపనూ తట్టి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కర్ణాటకలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో ఒకటైన విద్యుత్‌పై మాట తప్పి రైతాంగాన్ని నట్టేట ముంచేస్తుందని, అక్కడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నదని, కల్లబొల్లి మాయమాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించి గద్దెనెక్కి తర్వాత విస్మరిస్తారని ఆయన ఆరోపించారు. అధికార దాహంతో ఆరు పథకాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తారని, 60 ఏండ్లల్లో ఎందుకు ఇవ్వలేదని ఇప్పుడిస్తారని మాకు నమ్మకం లేదని ప్రశ్నించి వెనుకకు పంపించాలన్నారు. సంక్షేమ సర్కారు అంటేనే బీఆర్ఎస్. సీఎం కేసీఆర్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన పథకం, ఆర్థిక చేయూతను గుర్తు చేసి మహానాయకుడు మర్చిపోకూడదని చెప్పాలన్నారు. ప్రతి ఊరికి నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు, సీసీ మురికి కాల్వలను నిర్మించామన్నారు. నియోజకవర్గంలో అందరొక్కటై పోటీలో నిలిచిన మన కార్యకర్తలు అధైర్యపడకుండా ముందుకు సాగాలన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో, మంత్రి హరీశ్‌రావు సహకారాలతో నియోజకవర్గంలో అన్ని రంగాల అభివృద్ధి చేపట్టామన్నారు. అందరూ కలిసి మెలిసి సైనికుల్లా శ్రమించి, బీఆర్ఎస్ సత్తా చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్, పార్టీ మండలాధ్యక్షుడు రాంసింగ్, జడ్పీటీసీ నర్సింహరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నారాయణరావు, జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అలీ, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు బాపిరాజు, మార్డి పీఏసీఎస్ మాజీ చైర్మన్ జలందర్, నాయకులు పరమేశ్వర్, గని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

- **జహీరాబాద్‌లో 24 గంటల అందుబాటులో ఉంటా**
- **బీఆర్ఎస్ అన్నివర్గాల సంక్షేమానికి మ్యానిఫెస్టో ప్రకటన**
- **కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నది**
- **సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయం**
- **జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్**

జహీరాబాద్, అక్టోబర్ 18: లోకల్ వ్యక్తిని శాసనసభ ఎన్నికల్లో ఆశీర్వదించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు కోరారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని బుర్ధిపాడు, తుంకుంట, బుచినెల్లి, సత్వార్, చెరాగ్‌పల్లి, కాశీంపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ స్థానిక వ్యక్తికి అవకాశం కల్పించారని, శాసనసభ ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలన్నారు. పేదల సమస్యలు పరిష్కరించేందుకు 24 గంటలు జహీరాబాద్‌నే అందుబాటులో ఉంటాన్నారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో లేని హామీలు అమలు చేసి ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఓట్లు వేసి ఆదరించండి.. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాన్నారు. ఎన్నికల్లో గెలిపొందిన వెంటనే వంటగ్యాస్‌ను రూ.400 అందజేయనుండగా, రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.16 వేలు చేస్తామని ప్రకటించారని మ్యానిఫెస్టోలోని హామీలను ప్రజలకు వివరించారు. బుర్ధిపాడు, తంకుంట, బుచినెల్లి, సత్వార్, చెరాగ్‌పల్లి, కాశీంపూర్ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు తదితరులు

**కాంగ్రెస్ చేసింది ఏమిటీ..**

**– రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్**

ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ దేశంలో పాలన చేసింది. ఎందుకు అప్పుడు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయలేదని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎం కేసీఆర్ ఎన్నో మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రతి ఇంటికీ మిషన్ భగరీథ నీరు, వ్యవసాయానికి కాళేశ్వరం నీటిని ఎత్తిపోతల ద్వారా పంటల సాగుకు అందిస్తున్నారన్నారు. కాళేశ్వరం నీటిని సింగూర్ ప్రాజెక్టులో నింపి, ఎత్తిపోతల ద్వారా జహీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న 1.06 లక్షల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో నిధులు మంజూరు చేశారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు బుచినెల్లి, బుర్ధిపాడు, తుంకుంట శివారులోని పారిశ్రామికవాడల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావుకు భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.గుండప్ప, టెలికం బోర్డు సభ్యులు పవార్ శంకర్ నాయక్, జహీరాబాద్ పట్టణ, మండల, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం మండలాధ్యక్షులు సయ్యద్ మోహినొద్దీన్, తట్టు నారాయణ, రవీందర్, నర్సింలు, వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు విజయ్‌మోహన్, సంజీవ్‌రెడ్డి, కుద్బుద్దీన్, తంజీం, మహిళా నాయకురాలు మంజుల, సరస్వతిరెడ్డి, మాణెమ్మ, అనూషమ్మ, తూంకుంట సర్పంచ్ రాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్




మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు, పక్కన నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్ తదితరులు